
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
శుక్రవారం 14 నవంబరు 2025


నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొండపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఏఈ సత్యం తెలిపారు. కొండపాక, బందారం సబ్ స్టేషన్లలో మరమ్మతుల కారణంగా కొండపాక, బందారం, అంకిరెడ్డిపల్లి, దర్గా, జప్తినాచారం, దమక్కపల్లి గ్రామాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.


గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో వక్ఫ్‌బోర్డు స్థలంలో చేపడుతున్న నిర్మాణాలు

గజ్వేల్ పట్టణంలో వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. లీజు, కొనుగోలు పేరిట కోట్ల రూపాయల విలువ చేసే భూములను కొందరు దర్జాగా ఆక్రమించి, శాశ్వత నిర్మాణాలను చేపడుతున్నారు. వక్ఫ్ భూములలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా, అధికారుల్లో ఏమాత్రం స్పందన కనిపించడం లేదు. నేతలు సూత్రధారులుగా తెరవెనుక ఉండి ఈ కబ్జా పర్వానికి అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గజ్వేల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)

కబ్జా చేయ్.. కట్టేయ్!

- వక్ఫ్ భూముల్లో యథేచ్ఛగా నిర్మాణాలు
- లీజు పేరిట శాశ్వత భవనాలు
- కట్టడి చేయలేకపోతున్న టాస్క్‌ఫోర్స్
- పట్టించుకోని అధికారులు

సిద్దిపేట జిల్లాలో వక్ఫ్ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాల కట్టడి కోసం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ కమిటీ నామమాత్రంగా మారింది. స్థానిక రాజకీయ పార్టీల నాయకులు అంతా కలిసి ఈ అక్రమాలకు తెరలేపినట్లుగా తెలుస్తోంది. ఫేక్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. తమకు అధికార పార్టీ పెద్దల ఆశీస్సులు ఉన్నాయని, తమను అధికారులు ఏమీ చేయలేరని సదరు అక్రమార్కులు బాహాటంగానే చెబుతుండడం గమనార్హం. సాధారణ పౌరుడు 50 నుంచి 100 గజాల్లో ఇల్లు కట్టుకుంటే ప్రతాపం చూపించే అధికారులు, కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్న పెద్దల విషయంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు.

గజ్వేల్‌లో మెజారిటీ వక్ఫ్ భూములే

గజ్వేల్ పట్టణంలో సగానికి పైగా భూములు వక్ఫ్‌కు సంబంధించినవే ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ వెనకాల మొదలుకుని, ఐవోసీ కార్యాలయం, జాలిగామ బైపాస్ రోడ్డు, తూప్రాన్ రోడ్డు, రింగ్ రోడ్డు, జాలిగామ రోడ్డు, సంగాపూర్ రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ, భారత్‌నగర్ వంటి ముఖ్య ప్రాంతాల్లో వక్ఫ్ భూములు విస్తరించి ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో చదరపు గజం ధర రూ.20వేల వరకు పలుకుతుండడంతో అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలను చేపడుతున్నారు. స్థానిక నాయకులకు నయానో.. భయానో చెల్లించి వారి మెప్పు పొందుతూ, వారి ద్వారా అధికారులకు ముట్టజెప్పి నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. గజ్వేల్ రెవెన్యూ పరిధిలో దాదాపు 330 ఎకరాల విలువైన వక్ఫ్ భూములున్నప్పటికీ వాటిని కాపాడే నాథుడు లేకుండా పోయాడు. వక్ఫ్ అధికారులు వస్తే ఇతర శాఖల అధికారులు సహకరించడం లేదని, ఇతర శాఖల అధికారులు వస్తే వక్ఫ్ అధికారులు రావడం లేదని ఒకరిపై ఒకరు నెట్టేస్తూ కాలం వెల్లదీస్తున్నా.. జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

రాత్రికి రాత్రే నిర్మాణాలు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వక్ఫ్ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు, ఇతరత్రా నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ముఖ్యంగా జాలిగామ బైపాస్ రోడ్డులో మొదట్లో ఒకటి రెండు నిర్మాణాలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం రోడ్డు వెంట నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. రాత్రికి రాత్రి నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ నిర్మాణాలను ఎందుకు అడ్డుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొన్నది. ఈ అక్రమ నిర్మాణంపై మున్సిపాలిటీ నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల వరకు ఫిర్యాదులు అందుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఫిర్యాదుదారుల శ్రమ వృథా అవుతోంది. ఇప్పటికైనా అధికారులు అక్రమ నిర్మాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటారో లేక "మామూలు"గా వ్యవహరిస్తారో చూడాల్సిందే.

పరిహారం ఇవ్వరు..
పనులు చేయరు!


- మల్లన్నసాగర్ కాలువ భూసేకరణ... పరిహారంపై తాత్సారం
- ఐదేళ్లుగా భూములను అమ్ముకోలేక, పరిహారం రాక ఇబ్బందులు
- నిరాశ్రితులకు తప్పని తిప్పలు
- ప్రజాప్రతినిధుల హామీలు నీటి మూటలే!





మల్లన్నసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కోసం 2020లో భూసేకరణ నోటిఫికేషన్ జారీ చేసి ఐదేళ్లు గడిచినా రైతులకు పరిహారం చెల్లించలేదు. తక్కువ పరిహారాన్ని వ్యతిరేకించి రైతులు ఆందోళన చేయడంతో భూముల క్రయవిక్రయాలు నిలిచిపోయి, అటు మెరుగైన పరిహారం అందక, ఇటు భూమి అమ్ముకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

– తొగుట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి)



ప్యాకేజీ 12లో భాగంగా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కాలువ పనులు చేపట్టే రూట్ మ్యాప్

మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి ప్యాకేజీ 12లో భాగంగా దుబ్బాకకు గోదావరి నీటిని తరలించే ప్రధాన కాలువ ద్వారా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు చేపట్టేందుకు రెవెన్యూ అధికారులు 2020 జూన్ 26న నోటిఫికేషన్ జారీ చేశారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేట నుంచి లింగంపేట పటేల్ చెరువు వరకు 5.575 కిలోమీటర్ల పొడవునా 20 మీటర్ల వెడల్పుతో ఈ కాలువను నిర్మించాల్సి ఉంది. దీని ద్వారా 2,909 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశం ఉంది. అందుకోసం ఎల్లారెడ్డిపేటలో 17.16 ఎకరాలు, కాన్గల్‌లో 11.12 ఎకరాలు, తొగుటలో 37 గుంటలు, లింగంపేటలో 25 గుంటల భూమిని సేకరించాల్సి ఉంది. 2013 చట్టం ప్రకారం 30.20 ఎకరాల భూసేకరణ కోసం అప్పట్లో అధికారులు రైతులకు నోటీసులు జారీ చేశారు.

అవార్డు పాస్ చేసినా అందలేదు

అప్పట్లో అధికారులు రైతులకు నోటీసులు జారీ చేసి, ఎకరా భూమికి కేవలం రూ. 1.90లక్షలు మాత్రమే ధరగా నిర్ణయించారు. ఈ తక్కువ ధరను రైతులు తీవ్రంగా వ్యతిరేకించారు. మల్లన్నసాగర్ నిర్వాసితుల మాదిరిగా తమకు కూడా ఎకరాకు రూ. 13 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన నిర్వహించారు. 2023 అక్టోబరు 12న చెక్కుల పంపిణీకి కాన్గల్ గ్రామానికి వచ్చిన రెవెన్యూ అధికారులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులు నిర్బంధించి నిరసన వ్యక్తం చేశారు. దాంతో అధికారులు పరిహారం చెక్కులను కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. నోటిఫికేషన్ వేసినప్పటి నుంచి ఆ భూములపై ఆన్‌లైన్‌లో పీఎస్ అవార్డు జారీ చేసి భూముల క్రయవిక్రయాలను రెవెన్యూ అధికారులు నిలిపివేశారు.

మిగతా 8వ పేజీలో

పోస్టాఫీస్‌కు వచ్చి తీసుకెళ్లాలి

- గజ్వేల్ పోస్టల్ సిబ్బంది హుకుం
- డెలివరీ ఇవ్వకుండా కస్టమర్లకు ఇబ్బందులు



కస్టమర్ వచ్చి తీసుకువెళ్లిన పార్శిల్

గజ్వేల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): "పోస్టాఫీస్‌కు వచ్చి మీ పార్శిళ్లు, కొరియర్లు మీరే తీసుకుపోవాలి. మేము రాము" అంటూ గజ్వేల్ పోస్టాఫీస్ సిబ్బంది కస్టమర్లను ఆదేశిస్తున్నారు. ఒకవైపు పోస్టు సేవలను విస్తరించి, ప్రజలకు చేరువ చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తుంటే, గజ్వేల్ సిబ్బంది మాత్రం వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. వాస్తవానికి పెద్ద పార్శిళ్లను పోస్టాఫీస్ నుంచి, చిన్న పార్శిళ్లను ఇంటికే డెలివరీ చేయాలి. కానీ గజ్వేల్ సిబ్బంది చిన్న, పెద్ద తేడా లేకుండా అన్నిటినీ పోస్టాఫీస్‌కే వచ్చి తీసుకువెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు. అంతేకాకుండా, ఎంతో కొంత సమర్పించాలని కోరుతూ కస్టమర్లను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ముఖ్యంగా పలు గ్రామాలకు చెందిన వినియోగదారులు పోస్టుసేవల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

వసతుల బడి

- ప్రైవేటుకు దీటుగా కర్కపట్ల ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు
- గ్రామస్థులు, ఫార్మా సంస్థల భాగస్వామ్యంతో ఆధునిక రూపు

7

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా, ఒకరికి జైలు

8

చలి పంజా

- కనిష్ఠ ఉష్ణోగ్రతల నమోదులో రాష్ట్రంలో రెండో స్థానంలో ఉమ్మడి జిల్లా
- న్యాల్‌కల్‌లో అత్యల్పంగా 10.7 డిగ్రీలు నమోదు

మెదక్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. శీతల గాలుల ప్రభావంతో రాత్రి ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి పడిపోతుండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ఈ ఏడాది నవంబరు రెండో వారంలోనే, గత సంవత్సరం డిసెంబర్ మూడో వారంలో నమోదైన ఉష్ణోగ్రతలు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది.

గురువారం ఉదయం సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్‌లో 10.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, ఆదిలాబాద్ జిల్లా నేరేడిగొండ (9.5 డిగ్రీల) తర్వాత అత్యంత తక్కువ ఉష్ణోగ్రత నమోదై, ఉమ్మడి మెదక్ జిల్లా రెండో స్థానంలో నిలిచింది. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 20వ తేదీ వరకు చలి తీవ్రత మరింత పెరిగే సూచనలు ఉన్నాయి. గడచిన నాలుగు రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడంతో ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచు తీవ్రంగా ఉంటోంది. ఉదయం పది గంటలవుతున్నా ఎండలో వేడి పెరగడం లేదు. దీంతో ప్రజలు ఉదయం 8 గంటల వరకూ ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రోజువారీ పనుల నిమిత్తం బయటకు వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు

న్యాల్‌కల్‌లో 10.7 డిగ్రీలు.. గుమ్మడిదలలో 11.0, ఝరాసంఘంలో 11.2, కోహీర్‌లో 11.3, కొండపాకలో 11.4, అక్బర్‌పేట్ - భూంపల్లిలో 11.4, హవేళీఘనపూర్‌లో 11.5, రామాయంపేటలో 11.5, కంగ్టిలో 11.5, మర్కుక్‌లో 11.6, రాయపోలులో 11.7, నిజాంపేటలో 11.7, నార్సింగి 11.8, దుబ్బాక 11.9, నంగునూరు 11.9, మనోహరాబాద్‌లో 11.9 డిగ్రీలు నమోదయ్యాయి.



ఉపాధి హామీ పనులు అద్భుతం

- కర్ణాటక అధికారుల బృందం ప్రశంస

సిద్దిపేట రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పరిసర గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు అద్భుతంగా ఉన్నాయని కర్ణాటక రాష్ట్రానికి చెందిన అధికారుల బృందం కితాబిచ్చింది. గురువారం ఎన్‌ఐఆర్‌డీ ఆధ్వర్యంలో ఈ బృందం సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు, చిన్నగుండవెల్లి, మరియు నారాయణరావుపేట మండలం జక్కాపూర్, గుర్రాలగొంది గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులను సందర్శించింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్మించిన సామూహిక పశువుల హాస్టళ్లు, గొర్రెల సామూహిక షెడ్లు, రైతు వేదికలు, నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ షెడ్లు, నాటు కోళ్ల పెంపకం కేంద్రాలు, కోళ్ల ఫారం, మునగ తోటల పెంపకం, ఆయిల్ పామ్ తోటలతో పాటు ఉపాధి హామీలో చేపట్టిన ఇతర పనులు, స్టీల్ బ్యాంకును పరిశీలించారు. వారి వెంట ఎంపీడీవోలు, తహసీల్దార్, ఏపీడీలు, ఎంపీవోలు, ఏపీవోలు, కర్ణాటక రాష్ట్ర పంచాయితీ డెవలప్‌మెంట్ అధికారులు, పంచాయితీ అధ్యక్షులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కళాశాలల అభివృద్ధికి చర్యలు

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ రెడ్డి

హుస్నాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాలల అభివృద్ధికి ప్రభుత్వం సమగ్ర మార్పులకు శ్రీకారం చుట్టిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల, బాలికల కళాశాలలను సందర్శించిన అనంతరం జరిగిన అధ్యాపకుల సమావేశంలో మాట్లాడారు. మార్పుల్లో భాగంగా అధ్యాపకుల ముఖ ఆధారిత అటెండెన్స్‌తో పాటు ప్రతి శనివారం హెల్ప్ ప్రోగ్రాం కండక్ట్ చేయడం, క్రీడలు నిర్వహించడం ప్రతి సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రథమ స్థానంలో నిలపడానికి కృషి చేయాలన్నారు. కళాశాల అభివృద్ధికి ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ప్రతి కళాశాలకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలల అభివృద్ధికి రూ. 60 కోట్లు మంజూరు చేశారన్నారు. ప్రతి క్లాస్ రూమ్‌కు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి రాష్ట్రంలోని 430 కళాశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. అధ్యాపకులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాళ్లు గంగాధర్, లలిత పాల్గొన్నారు.


అధ్యాపకుల సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

హుస్నాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఈ రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వాలే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అఖిలపక్షాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వం బిల్లును ఆమోదించాలన్నారు.

అభివృద్ధి పనుల్లో ప్రొటోకాల్ పాటించాల్సిందే

- 'దిశా' సమావేశంలో ఎంపీ రఘునందన్‌రావు ఆగ్రహం
- కేంద్ర పథకాలు, అభివృద్ధి పనులపై సమీక్ష
- పెండింగ్ పనుల త్వరగా పూర్తి చేయాలని ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిపై జరిగిన దిశా (జిల్లా అభివృద్ధి పర్యవేక్షణ) సమావేశం వాడివేడిగా సాగింది. గురువారం ఐడీవోసీలోని ప్రధాన సమావేశ మందిరంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు అధ్యక్షతన ఈ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం పలుమార్లు దృష్టికి తెచ్చినా మార్పురావడం లేదన్నారు. మరోసారి అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దుబ్బాక నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులు, అర్హులను ఎంపిక చేయాలని చెప్పారు. అంగన్‌వాడీ, పంచాయతీ భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలనాన్నారు. పనుల పూర్తిలో గుత్తేదారులు అలసత్వం వహిస్తే హెచ్చరించి పనులు పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గోసానపల్లి సబ్‌స్టేషన్ పనులు త్వరగా ప్రారంభించాలని, మల్లన్నసాగర్ ద్వారా దుబ్బాక నియోజకవర్గంలోని చివరి గ్రామాల వరకు కాలువలు, చెరువుల ద్వారా నీరు అందించాలని సూచించారు. వారంతపు సంతల్లో కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లను ఏర్పాటు చేయాలి. లక్షకు పైగా కార్మికులు ఉన్న చోట ఈఎస్‌ఐ ఆసుపత్రి మంజూరు కోసం వారి వివరాలు సమర్పిస్తే ప్రతిపాదనలు పంపిస్తానని తెలిపారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం లబ్ధిదారులతో సమావేశం నిర్వహించాలని, చేనేత కార్మికుల కోసం అప్రెల్ పార్క్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు సమావేశంలో కలెక్టర్ హైమావతి, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, ఆయా శాఖల అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, దిశకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువజన ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ఈనెల 18న సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో నిర్వహించనున్న యువజన ఉత్సవాలు, సైన్స్‌మేళాకు సంబంధించి పోస్టర్‌ను కలెక్టర్ హైమావతితో కలిసి ఎంపీ రఘనందన్‌రావు కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఎంపీని కలిసి విన్నవించారు.


హాజరైన వివిధ శాఖల అధికారులు

గుడిసె కాలిపోయి వీధిన పడ్డ కుటుంబం

- అర్హతలున్నా మంజూరు కాని ఇందిరమ్మ ఇల్లు
- ఆదుకోవాలని రేణుక కుటుంబం వేడుకోలు


నిత్యావసర సరుకులు అందజేస్తున్న తహసీల్దారు

కొండపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే భర్తను కోల్పోయి ఇద్దరు పిల్లలతో కలిసి పూరి గుడిసెలో దయనీయ జీవితాన్ని గడుపుతున్న రేణుక కుటుంబాన్ని ఇటీవల జరిగిన వరుస దుర్ఘటనలు మరింత కుంగదీశాయి. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడగ నివాసి అయిన దబ్బెర రేణుక ఏడేళ్ల క్రితం భర్తను కోల్పోయింది. గ్రామపెద్దలు ఇచ్చిన 60 గజాల స్థలంలో గుడిసె వేసుకొని, ఇద్దరు పిల్లలను పోషించుకోవడానికి కూలి పనులపై ఆధారపడుతోంది. అయితే, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గుడిసె కూలిపోయింది. ఈ ప్రమాదంలో రేణుక కుటుంబం త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడింది. ఆ సమయంలో ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. అంతకుముందు, పెద్ద కొడుకు ఆటోలో నుంచి కింద పడడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఇలా కనీస సౌకర్యాల కోసం పోరాడుతున్న సమయంలోనే ఊహించని అగ్నిప్రమాదం సంభవించింది. ఈనెల 8న ప్రమాదవశాత్తు ఆమె ఇంటికి మంటలు అంటుకుని కాలిపోవడంతో.. ఉన్న ఆశ్రయం కూడా లేకుండా పోయింది. విధి లేని పరిస్థితిలో ఐదు రోజులుగా అదే గుడిసెలో నివసిస్తూ రాత్రి బంధువుల ఇంట్లో తలదాచుకుంటోంది. ఇందిరమ్మ ఇళ్ల కోసం రేణుక దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఆమెకు ఇల్లు మంజూరు కాలేదు. మొదటి విడతలో గ్రామానికి 25 ఇళ్లు మంజూరయ్యాయి. అన్ని అర్హతలున్నా రేణుకకు ఇల్లు మంజూరు కాకపోవడమేంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అయితే, అధికారులు మాత్రం రెండో జాబితాలో మంజూరవుతుందని చెబుతున్నారు. మానవత్వంతో ఎవరైనా దాతలు సహకరించి రేణుక కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గుడిసె కాలిపోవడంతో ఆశ్రయం కోల్పోయిన రేణుక, ఆమె పిల్లలు





సరిహద్దులో అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

● సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్

జహీరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : సరిహద్దులో అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ పేర్కొన్నారు. బుధవారం రాత్రి జహీరాబాద్ సరిహద్దులోని చిరాగ్‌పల్లి జాతీయ రహదారిపై సుమారు 80 సిబ్బందితో నాకాబందీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దులో అక్రమ తరలిస్తున్న గుట్కా, రేషన్ బియ్యం, మాదక ద్రవ్యాలు, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల శాంతి భద్రతలో భాగంగా అంతర్ రాష్ట్ర నేరస్తులు, పేలుడు సామాగ్రి జిల్లాలోకి రాకుండా ప్రతి రోజు పలు పోలీస్ స్టేషన్‌లను ఎంపిక చేసి ఆ ప్రాంతంలో వాహనల తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. 850 వాహనాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యంను తరలిస్తున్న వాహనదారులను అదుపులోకి తీసుకోవడంతో పాటు మద్యం సేవించి వాహనాలను నడిపిన 9 మంది పై కేసు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీలో అదనపు ఎస్పీ రఘునందన్ రావు, డీఎస్పీ సైదా, జహీరాబాద్ సీఐ శివలింగం, ఆయా మండలాల ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


చిరాగ్ పల్లి సరిహద్దులో తనిఖీలో సంగారెడ్డి ఎస్పీ పంకజ్





బీసీ హాస్టల్‌లో గోడలపై ఇంకా పాత వారి పేర్లే

● బదిలీ అయిన కలెక్టర్ క్రాంతి, మాజీ ఉపరాష్ట్రపతి ధన్కర్ పేర్లు దర్శనం
● హాస్టల్ వార్డెన్ నిర్లక్ష్యం, విద్యార్థుల తప్పుదోవ


సంగారెడిలోని బీసీ(బి)బాలుర కళాశాల వసతిగృహం గోడకు ఏర్పాటు చేసిన బ్యానర్‌లో దర్శనమిస్తున్న మారిన కలెక్టర్, ఉపరాష్ట్రపతి పేర్లు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఏ శాఖలోనైనా బదిలీ అయిన వారి స్థానంలో కొత్త వారు వస్తే వారి పేర్లు ప్రభుత్వ కార్యాలయాలు, సమాచార హక్కు చట్టం బోర్డుపై ఉంచుతారు. కానీ కొందరు అధికారుల నిర్లక్ష్యం విద్యార్థులను తప్పుదోవపట్టించేలా ఉన్నది. ఇందుకు సంగారెడ్డిలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్ సమీపంలోని బీసీ(బి)బాలుర కళాశాల వసతి గృహ వార్డెన్ నిర్లక్ష్యం ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నారు. అయితే సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన వల్లూరు క్రాంతి బదిలీ కావడంతో ఆమె స్థానంలో గత జూన్ 13 న కొత్తగా ప్రావీణ్య బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా భారత ఉపరాష్ట్రపతి ధన్కర్ స్థానంలో గత సెప్టెంబరులో సీ.పీ.రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టారు. వీరిరువురు మారినా వీరు పేర్లు మాత్రం ఇంకా ఆ హాస్టల్ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో దర్శనమివ్వడం గమనార్హం. ఇది వసతి గృహ వార్డెన్ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నది.


















పల్లెల్లో ప్రభుత్వ పాఠశాల అంటే పాత గోడలు, విరిగిన బెంచీలు, శిథిల భవనాలు అన్నది నిన్నటి మాట. అందుకు ముర్కుక్ మండలం కర్కపట్ల ప్రాథమికోన్నత పాఠశాలనే నిదర్శనం. అధునాతన వసతులతో పిల్లల బంగారు భవిష్యత్‌కు నిలయంగా మారుతున్నది ఈ బడి. చల్లని చెట్ల నీడ, చుట్టూ పూలతో ఆహ్లాదకర వాతావరణంతో అందరి చూపును ఆకర్షిస్తోంది. గ్రామస్థుల సహకారం, ఫార్మా కార్పొరేట్ సంస్థల భాగస్వామ్యం, పాఠశాల సిబ్బంది, నేతల కృషితో ఈ బడి ఆదర్శంగా నిలుస్తున్నది


పాఠశాలలో నిర్మించిన డైనింగ్‌హాల్


బాలికల టాయిలెట్స్

వసతుల బడి

ప్రైవేటుకు దీటుగా కర్కపట్ల ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు

- గ్రామస్థులు, ఫార్మా సంస్థల భాగస్వామ్యంతో ఆధునిక రూపు
- విద్యార్థులకు నిత్యం గుడ్డు, అరటిపండు అందజేత
- ఆరుగురు వలంటీర్లతో తరగతికో ఉపాధ్యాయుడు
- డిజిటల్ క్లాస్‌రూమ్ ఏర్పాటుకు ప్రధానోపాధ్యాయుడి విజ్ఞప్తి


పరిశుభ్ర వాతావరణంలో విశాలమైన వాష్ ఏరియా


పాఠశాల ప్రాంగణంలో చెట్ల చుట్టూ నిర్మించిన దిమ్మెలు

మర్కుక్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని కర్కపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రస్తుతం 121 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బడి ప్రాంగణంలో చల్లని నీడనిచ్చే పెద్ద చెట్లు, దాని చుట్టూ దిమ్మెలు ఏర్పాటు చేసి విద్యార్థులు కూర్చోవడానికి అనువుగా తీర్చిదిద్దారు. ఇక్కడ పెంచిన మొక్కలు కేవలం నీడకే కాక, పిల్లలకు పర్యావరణ ప్రేమను కూడా నేర్పుతున్నాయి.

సకల సౌకర్యాలు

ఆధునిక వసతులు, పౌష్టికాహారం విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మినరల్ వాటర్ సౌకర్యాన్ని కల్పించారు. శుద్ధి చేసిన తాగునీరు అందుబాటులో ఉంచారు. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు కొన్ని ప్రభుత్వ భవనాలు ఉండగా, మరికొన్ని అధునాతన తరగతి గదులను ఫార్మా కంపెనీల సీఎస్ఆర్ నిధులతో నిర్మించడం విశేషం. బాలురు, బాలికలకు వేర్వేరుగా పరిశుభ్రమైన టాయిలెట్లను నిర్మించారు. పాఠశాల ప్రగతికి ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు రవినాయక్, భాగ్యలక్ష్మి, స్థానిక యువ నాయకులు ఎంతగానో కృషి చేస్తున్నారు. హెచ్ఎం నిత్యం పరిశుభ్రతను తనిఖీ చేస్తారు.

విద్యా వలంటీర్ల నియామకం..

తరగతికి ఒక ఉపాధ్యాయుడు తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ప్రధానోపాధ్యాయుడు మల్లేశం సూచించగా, కంపెనీల సహకారంతో ఆరుగురు విద్యా వలంటీర్‌లను నియమించారు. ఒక్కొక్కరికి నెలకు రూ.15,000 జీతాన్ని కంపెనీలే అందజేస్తున్నాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు, వలంటీర్లు సమన్వయం చేసుకుంటూ నిబద్ధతతో కూడిన ఉపాధ్యాయ బృందం ఊరి బడిని సజావుగా నడిపిస్తోంది.

డిజిటల్ తరగతులు అవసరం..



ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతులు చాలా అవసరం. ప్రభుత్వం 8వ తరగతి నుంచి ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క ప్యానల్‌ను సమకూర్చింది. కానీ, ఈ పాఠశాలలో ఏడవ తరగతి వరకే ఉంది కాబట్టి, ప్రభుత్వ ప్యానెల్ రాలేదు. ఫార్మా యాజమాన్యాలు స్పందించి డిజిటల్ తరగతుల కోసం ప్రొజెక్టర్లు, ప్యానెల్‌ను సమకూర్చాలి.

- మల్లేశం, ప్రధానోపాధ్యాయుడు

విశాలమైన డైనింగ్ హాల్..

గతంలో విద్యార్థులు గడ్డిపై లేదా మట్టిలో కూర్చుని భోజనం చేసేవారు. కానీ, ఇప్పుడు విశాలమైన డైనింగ్ హాల్ ఏర్పాటు చేయడంతో పద్ధతిగా భోజనం చేస్తున్నారు. ప్రభుత్వం తరఫున వారానికి మూడు కోడిగుడ్లు ఇస్తుండగా, ఫార్మా కంపెనీల నుంచి మరో మూడు రోజులు గుడ్డు అందిస్తున్నారు. ప్రతి రోజు కంపెనీల సహకారంతో మధ్యాహ్నం అరటిపండు కూడా ఇస్తున్నారు. దీంతో ఆ పాఠశాలలో ప్రతిరోజు ఒక కోడిగుడ్డు, రెండు రకాల కూరలు, ఒక అరటిపండు విద్యార్థులకు అందుతున్నాయి.



క్రైం కార్నర్

వింతగా ప్రవర్తిస్తూ.. విగతజీవిగా మారి..

- మూడు రోజులుగా మతిస్థిమితం కోల్పోయి వ్యక్తి వింతగా ప్రవర్తన
- భార్యపై దాడి, ఏడాది వయస్సున్న పాపను బిల్డింగ్‌పై నుంచి పడేసిన వైనం
- గురువారం రైలు కిందపడి బలవన్మరణం


రైలు పట్టాలపై శంకర్ మృతదేహం

తూప్రాన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తిస్తున్న ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... తూప్రాన్ పట్టణ పరిధిలోని వెంకటాపూర్(పీటీ)కి చెందిన అంగడిశంకర్(52) కూలి పనులు చేసుకుంటూ భార్య అనితతో కలిసి జీవించేవాడు. శంకర్ కల్లు, మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ సభ్యులు వారించడంతో వారం రోజులుగా అతను మద్యం తాగడం మానేశాడు. అయితే, కల్లు మానేయడం వల్లనో, మరో కారణమో కానీ మూడు రోజులుగా శంకర్ మతిస్థిమితం కోల్పోయి వింతగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. దీంతో కుటుంబ సభ్యులు పూజలు చేయించి, మంత్రాలు వేయించినా ఫలితం దక్కలేదు. బుధవారం తనపై ఎవరో ఏదో చేస్తున్నారని గొడవ పడుతూ శంకర్ తన భార్య అనితపై రాడ్‌తో దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. అంతటితో ఆగకుండా, అక్కడే ఉన్న తన అన్న సత్తయ్య కుమారుడు మనుమరాలు ఏడాది పాపను బంగ్లాపైకి తీసుకెళ్లి కిందకు తోసేశాడు. గాయపడిన భార్య అనితను, చిన్నారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శంకర్ రాత్రంతా పలువురి ఇండ్ల తలుపులు బాదుతూ గడిపినట్లు స్థానికులు తెలిపారు. గురువారం ఉదయం శంకర్ సమీపంలోని బ్రాహ్మణపల్లి రైల్వేస్టేషన్‌లో పట్టాలపై శవమై కనిపించాడు. మతిస్థిమితం కోల్పోయిన శంకర్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం లోడ్ ట్రాక్టర్ బోల్తా

- తప్పిన పెను ప్రమాదం


బోల్తా పడిన ట్రాక్టర్

హుస్నాబాద్ రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం తోటపల్లి సమీపంలో ప్రధాన రహదారి పక్కన ధాన్యం బస్తాల లోడ్ ట్రాక్టర్ బోల్తా పడిన సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. గురువారం అక్కన్నపేట మండలం పంతుల్‌తండా నుంచి కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకుని హుస్నాబాద్ మండలంలోని రైస్‌మిల్‌కు తరలిస్తున్నారు. తోటపల్లి సమీపంలోని ప్రధాన రహదారిపై ఉన్న గుంతను తప్పించబోయిన డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో లోడ్ బస్తాల ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ అక్కడే ఉన్న విద్యుత్ స్తంభంపై పడడంతో అది విరిగిపోయింది. అయితే, సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

వాగులోకి దూసుకెళ్లిన కారు

- తృటిలో తప్పిన ప్రమాదం
- ముగ్గురికి స్వల్ప గాయాలు


కలివేముల వాగులోకి దూసుకెళ్లిన కారు

కంది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా కారు అదుపుతప్పి వాగులోకి దూసుకెళ్లిన సంఘటన కంది మండల పరిధిలోని కలివేముల గ్రామంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కంది మండలం తోపుగొండ గ్రామానికి చెందిన గొల్లగూడెం సురేష్, అతని అన్న మల్లేశం, వదిన లక్ష్మిలతో కలిసి గురువారం ఉదయం సంగారెడ్డిలో ఒక వివాహానికి తమ కారులో వెళ్లారు. తిరిగి వస్తున్న క్రమంలో కలివేముల వద్ద మూలమలుపు తిరుగుతుండగా కారు అదుపుతప్పి ఒక్కసారిగా వాగులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు ముగ్గురిని బయటకు తీసి, చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. తరచుగా ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, ఆర్ అండ్ బీ అధికారులు వంతెనకు రక్షణ గోడలు నిర్మించాలని కలివేముల గ్రామస్థులు కోరుతున్నారు.

కుళ్లిన గుడ్ల పంపిణీపై విచారణ


అంగన్‌వాడీ కేంద్రంలో నిల్వ ఉన్న గుడ్లను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్

హత్నూర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలలో కుళ్లిన గుడ్లు అనే శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ అధికారులు స్పందించారు. గురువారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శీలావతి ముచ్చర్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చిన్నారలుఉ, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసేందుకు నిల్వ ఉంచిన గుడ్లను పరిశీలించారు. అదేవిధంగా ఇదివరకు కుళ్లిన గుడ్లు సరఫరా అయిన గర్భిణులు, చిన్నపిల్లల తల్లులతో ప్రత్యేకంగా మాట్లాడి పలు వివరాలు సేకరించారు. వారికి కుళ్లిన గుడ్ల స్థానంలో అదనంగా గుడ్లు ఇప్పించారు. విధి నిర్వహణలో టీచర్లు సక్రమంగా పని చేయాలని సూపర్‌వైజర్ శీలావతి సూచించారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ప్రతిభ కనబర్చిన సానియా సదా

సిద్దిపేట కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :టీ శాట్ స్టూడియో, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో సిరిసిల్ల జోన్ జట్టు ప్రథమ బహుమతి సాధించింది. కాగా ఈ జట్టుకు సిద్దిపేట ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సానియా సదా నేతృత్వం వహించింది. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఆన్వెల్ స్టూడెంట్ కాంపిటీషన్‌లో భాగంగా జరిగిన కార్యక్రమంలో విజేతగా నిలిచిన జట్టుకు మంత్రి శ్రీధర్ బాబు మెమొంటో అందజేశారు. విద్యార్థిని సానియా సదాను ఇందిరానగర్ ప్రధానోపాధ్యాయుడు రాజ ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

ఫ్రీ కోచింగ్‌కు దరఖాస్తులు

- ఈ నెల 20 నుంచి తరగతులు ప్రారంభం
- మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ అర్బన్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతలకు ఉచిత కోచింగ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుపేద, గ్రామీణ యువతకు ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. ఈ క్యాంపులో అభ్యర్థులకు పోలీసు, ఆర్మీ, రైల్వే, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎస్ఐ, కానిస్టేబుల్‌తోపాటు ఇతర ప్రభుత్వ రంగ పోటీ పరీక్షలకు అవసరమైన పాఠ్యబోధన, ఫిజికల్ ట్రైనింగ్, మాక్ టెస్టులు, కౌన్సెలింగ్ వంటి ప్రేరణాత్మక సదస్సులు ఉంటాయన్నారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, పోలీసు అధికారులు, ట్రైనర్ల ద్వారా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల యువత నుంచి ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 20 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తామన్నారు. నిరంతర పర్యవేక్షణలో శిబిరం కొనసాగుతోందన్నారు. అభ్యర్థులు, క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో పాల్గొని తమ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఎస్పీ సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగితా వివరాలకు ఫోన్ 8712529742, 7893924601 నంబర్లను సంప్రదించాలన్నారు.


పాడైన బోరు వద్ద వాటర్ బాటిళ్లతో విద్యార్థులు

విద్యార్థులకు తాగునీటి కష్టాలు

- పాఠశాల ఆవరణలో పాడైన బోరు
- 8 నెలలైనా మరమ్మతులకు నోచుకుని వైనం
- ఇంటినుంచే నీటి బాటిళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు

కోహీర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గత 8 నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 169 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల తాగునీటి సౌకర్యార్థం పాఠశాల ఆవరణలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బోరు ఎనిమిది నెలలుగా చెడిపోయి ఉంది. దీంతో విద్యార్థులకు తాగునీటి కష్టాలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా, మధ్యాహ్న భోజనం వండేందుకు కూడా నీరు దొరకని పరిస్థితి ఏర్పడింది. బోరు పాడవ్వడంతో విద్యార్థులు వారి వారి ఇళ్ల నుంచే వాటర్ బాటిల్‌లలో తాగునీటిని తెచ్చుకుంటున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు సైతం గ్రామంలోకి వచ్చి బిందెలతో నీరు తీసుకువచ్చి వంట చేయాల్సి వస్తోంది. తాగునీటి ఇబ్బంది ఇంత తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. పాడైన బోరును బాగు చేయించాలని సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు స్పందించి, తాగునీటి బోరును బాగు చేయించి విద్యార్థుల కష్టాలు తీర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

చదివింది పాలిటెక్నిక్.. చేసేది చోరీలు

- జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్ పాల్పడుతున్న యువకుడు
- వృద్ధురాలి కళ్లలో కారం చల్లి పుస్తెలతాడు అపహరణ
- 24 గంటల్లో నిందితుడి పట్టుకున్న పోలీసులు

జోగిపేట రూరల్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి):పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యాధికుడు.. జల్సాలకు అలవాటు పడి చైన్ స్నాచింగ్ చేయడం మొదలు పెట్టి పోలీసులకు దొరికాడు. జోగిపేట పట్టణంలో వృద్ధురాలి మెడలోంచి పుస్తెల తాడు చోరీకి ఒగుంల్లైన సంగతి విదితమే.. ఈకేసులో 24 గంటల్లోనే నిందితుడిని పట్టుకుకుని రిమాండ్‌కు తరలలించినట్లు జోగిపేట సీఐ అనిల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జోపేఏటలోని తన కార్యాలయంలో.. ఎస్ఐ పాండుతో కలిసిఈకేసుకు ససంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన జనుముల నవీన్(37) సివిల్ ఇంజనీరింగ్‌లో పాలిటెక్నిక్ పూర్తి చేసి, పటాన్‌చెరులోని ఓప్రైవేటు కంపెనీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ.... తన భార్య పిల్లలను పోషిస్తున్నాడు. అయితే జల్సాలకు అలవాటు పడ్డ నవీన్‌కు తన ఉద్యోగం ద్వారా వచ్చే జీతం సరిపోకపోవడంతో దొంగతనాలు, ముఖ్యంగా చైన్ స్నాచింగ్ చేయడం మొదలు పెట్టాడు. ఇదే సమయంలో.. బుధవారం జోగిపేటకు వచ్చిన నిందితుడు నవీన్.... కంట్లో శంకరంపేట మాణెమ్మ.. తన నెలవారీ మందుగోళీల కొనుగోలు కోసం వచ్చి ఇంటికి వెళ్తున్న విషయాన్ని గమనించి ఆమెను వెంబడించాడు. అయితే, సదరు మాణెమ్మ ఇంట్లోకి వెళ్ళి... మందులు ఇంట్లో పెట్టి.. చిన్న గేటు వద్ద ఆరు బయట ఎండకు కూర్చున్న విషయాన్ని గమనించిన నవీన్.. వేగంగా గేటు తీసి లోపలికి వచ్చి.. మాణెమ్మ కళ్ళల్లో కారం చల్లి.....ఆమె మెడలోంచి పుస్తెల తాడును లాగాడు. ఈక్రమంలో ఇద్దరికీ పెనుగులాట జరిగి, మాణెమ్మ మెడ, వీపుపై గాయాలయ్యాయి. ఇంతలో మాణెమ్మ అరవడంతో ఇంట్లోనే లోపలి గదిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆమె కూతురు బయటికి వచ్చి.. నవీన్‌ను నిలువరించే ప్రయత్నం చేయగా, ఆమెను విసురుగా తోసిన నవీన్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈవిషయాన్ని తెలుసుకున్న సీఐ అనిల్, ఎస్ఐ పాండు, సంఘటనాఆ స్థలానికి వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ టీవీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు నిందితుడిని గురువారం ఉదయం పట్టుకుని తమదైన శైలిలో విచారించగా, పుస్తెల తాడు చోరీ విషయాన్ని సదరు నిందితుడు ఒప్పుకున్నాడు. ఈమేరకు నిందితుడు జనుముల నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు, అతని వద్దనుంచి బంగారాన్ని రికవరీ చేసినట్టు సీఐ అనిల్ వివరించారు.

కార్తీక దీపోత్సవం

- ఘనంగా శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సతీమణి అనుపమారెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం పురస్కరించుకొని నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయం ఆవరణలో గురువారం కనుల పండుగగా కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. శివపార్వతుల కల్యాణం నిర్వహించిన అనంతరం మహిళలు కార్తీక దీపాలను వెలిగించారు. స్థానిక ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి సతీమణి అనుపమారెడ్డితో కలసి శివపార్వతుల కల్యాణోత్సవంలో మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై తిలకించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్, శ్రీపంతులు, మోహన్‌పంతులు తదితరులు హాజరయ్యారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జరిమానా, ఒకరికి జైలు


మందుబాబులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ మురళీ

గజ్వేల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి రూ.40,00 జరిమానా, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష పడింది. మద్యం తాగి వాహనాలు నడిపొద్దని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళీ సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మద్యం తాడినవాహనాలు నడుపుతూ పట్టుబడిన పలువురికి గురువారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగే వాహనాలు నడపడం వలన కలిగే దుష్పరిణామాలను గూర్చి వివరించారు. ఏదైనా ప్రమాదం జరిగితే కుటుంబాలు ఆగమవుతాయని, కుటుంబాలు రోడ్డున పడుతాయని హెచ్చరించారు. రెండవ సారి దొరికితే రూ.15వేల జరిమానా, ఆరు నెలల జైలుశిక్ష విధించడంతో పాటు డ్రైవింగ్ లైసెన్సను సస్పెండ్ చేయడం జరుగుతుందన్నారు.

నలుగురికి రూ.40వేల జరిమానా

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ తీర్పును వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం.మురళీ తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని పలు చౌరస్తాల్లో ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో నలుగురు వ్యక్తులు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడగా, గురువారం వారిని కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపి నలుగురికి రూ.10వేల చొప్పున రూ.40వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెలువరించినట్లు సీఐ మురళీ తెలిపారు.

మరొకరికి మూడు రోజుల జైలు

రాయపోల్ : డ్రంకెన్ డ్రైవ్ కేసులో మరో వ్యక్తికి జైలు శిక్ష పడింది. రాయపోల్ ఎస్సై మానస కథనం ప్రకారం.. పోలీసులు మంగళవారం తిమ్మకపల్లి బ్రిడ్జి వద్ద తనిఖీలు చేస్తుండగా చిన్నమాసాన్‌పల్లి గ్రామానికి చెందిన సౌక్యం ప్రశాంత్ మద్యం తాగి బైక్ నడుపుతున్నట్లు తేలింది. అతడిని గురువారం గజ్వేల్ కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ స్వాతి నిందితుడికి 3 రోజుల జైలు విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మద్యం తాగి వాహనాల నడిపితే చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి

కొండపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ అన్నారు. కొండపాకలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14, అండర్ 19 క్రీడా పోటీల ముగింపు సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని ఓడిపోయామనే భావన లేకుండా అది ఒక గెలుపుకు నాందిలాగా తీసుకోవాలని సూచించారు. క్రీడలు మానసిక ధైర్యాన్ని కలిగించడంతో చదువులో రాణిస్తామన్నారు. చదువుతో పాటు క్రీడల్లో పాల్గొంటూ ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మహిపాల్ రెడ్డి వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్ లు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు మొమెంటోలను అందజేశారు.

వ్యక్తి అదృశ్యం


ఆలం శ్రీనివాస్ (ఫైల్)

తొగుట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన తొగుట మండలం తుక్కాపూర్ గ్రామ సమీపంలో చేపడుతున్న మల్లన్నసాగర్ రిజర్వాయర్ వద్ద చోటు చేసుకుంది. తొగుట ఎస్సై వివరాల ప్రకారం.. కొమురం భీం - ఆసీఫాబాద్ జిల్లా కౌటాల మండలం కోయగూడ గరుడపేట గ్రామానికి చెందిన ఆలం శ్రీనివాస్ (59) సెంట్రింగ్ పనులు చేయడానికి మల్లన్నసాగర్ లో పనిలో చేరాడు. ఈ క్రమంలో 2023 ఏప్రిల్ 2 రోజున పనికి వెళ్లకుండా ఆరోగ్యం బాగాలేదని ఇంట్లోనే ఉంటానని తోటి పనివారైనా ప్రశాంత్, పొట్టిలకు చెప్పాడు. వారు పని ముగించుకుని ఇంటికి చేరుకోగా ఆలం శ్రీనివాస్ కనిపించకుండా పోయాడు. చుట్టు పక్కల ఎక్కడ వెతికినా అతడి ఆచూకీ లభించలేదు.

అతడి భార్య ఆలం బొందక్క పోలీసుస్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోద్ చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తొగుట ఎస్సై రవికాంత్‌రావు తెలిపారు. ఎవరికైనా ఆచూకీ లభిస్తే 8712667343, 8712667465లకు సమాచారమందించాలని పోలీసులు సూచించారు.

విద్యుత్ షాక్‌తో పాడి ఆవు మృతి

చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం నాగపురి గ్రామానికి చెందిన పట్నం నర్సవ్వ వ్యవసాయబావి వద్ద విద్యుత్‌షాక్ తగిలి పాడి ఆవు మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. వ్యవసాయబావి ఆవరణలో గడ్డి మేస్తుండగా, సమీపంలోని విద్యుత్‌వైర్ తగిలి మృత్యువాతపడింది. ఆవు మృతితో రూ.1లక్ష నష్టంవాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని నర్సవ్వ వేడుకుంది.

ప్లాస్టిక్‌ను అంతం చేయాలి


పందిల్ల స్టేజీ వద్ద వ్యర్థాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

హుస్నాబాద్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి ఒక్కరు ప్లాస్టిక్‌ను సమూలంగా అంతం చేసేందుకు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న స్టీల్ బ్యాంకును ఉపయోగించుకోవాలని సహస్ స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్ ఇటికాల చిన్నా పేర్కొన్నారు. గురువారం హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్టాల్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. తడిచెత్త, పొడిచెత్త, ప్రమాదకరమైన చెత్త, ఎలక్ట్రానిక్ వేస్ట్ అనే నాలుగు రకాల చెత్తలను వేరు చేసి చెత్తబండికి ఇవ్వాలన్నారు. దీని వలన తడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా మార్చడం జరుగుతుందని వివరించారు. పొడిచెత్తను రీసైక్లింగ్ చేయడం వల్ల ప్లాస్టిక్ నివారణ జరుగుతుందన్నారు. అదే విధంగా గృహ అవసరాలకు, క్లాత్ సంచులను వాడాలని సూచించారు.

ఈ సందర్భంగా 2016 నిబంధనల ప్రకారం ఘన వ్యర్థాల నిర్వాహణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సాహస ఎన్‌జీవో ఫీల్డ్ సూపర్‌వైజర్ బండి బాలరాజు, వేల్పుల సంపతి, లింగాల వినీత్, శ్రావినేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు జడ్పీఎస్ఎస్ విద్యార్థులు

చేర్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈమేరకు ఇటీవల జిల్లాస్థాయి అండర్-14, అండర్-17విభాగాల్లో జరిగినపోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఆర్టిస్టిక్ యోగాపేర్, రిథమిక్ యోగాపేర్ అండర్-17 బాలికల విభాగంలో పి. ఆవంతిక, ఎస్.సాత్విక, ట్రెడిషనల్ యోగాపేర్ అండర్-14 విభాగంలో పి.వైష్ణవి ప్రథమస్థానంలోనిలిచి బంగారుపతకాలు సాధించారు. ఈనెల 15, 16, 17తేదీలలో కరీంనగర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈమేరకు గురువారం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను సత్కరించారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మిరుదొడ్డి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఖాతాదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అక్బర్‌పేట-భూంపల్లి జిల్లా సహకార కేంద్రబ్యాంకు(డీసీసీబీ)బ్యాంకు మేనేజర్ వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక బ్యాంకులో స్వర్ణనిధి కరపత్రాన్ని మహిళసంఘాల సభ్యులతో కలిసి విడుదల చేశారు. అనంతరం మహిళ సంఘాల సభ్యులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు.

ఫుట్ పాత్‌లపై వ్యాపారాలు చేయొద్దు


వ్యాపారస్థులతో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

హుస్నాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఫుట్‌పాత్‌లను ఆక్రమించి దానిపై సామగ్రి పెట్టి వ్యాపారాలు చేయవద్దని సీఐ శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల ఫుట్‌పాత్‌లపై సామగ్రి పెట్టి వ్యాపారం చేసే వారికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఫుట్‌పాత్‌లతో పాటు రోడ్డు పైకి వచ్చి సామాన్లు, అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులు పెట్టి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు. వ్యాపారస్థులు ట్రాఫిక్ నిబంధనలు, మున్సిపల్ నిబంధనలు, మార్కెట్ నిబంధనలు పాటించి వ్యాపారాలు చేసుకోవాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వ్యాపారస్థులు వారి షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై లక్ష్మారెడ్డి పోలీసు సిబ్బంది ఉన్నారు.

త్వరగా నిర్మాణాలు పూర్తి చేయండి

-డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

కొమురవెల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం పరిధిలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల నిర్మాణాలను తొందరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలనీ గురువారం జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించారు. బండగుట్టపై నిర్మిస్తున్న 50 గదుల సత్రం నిర్మాణ పనులను,క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనుల్లో వేగం పెంచి కల్యాణానికి ముందే అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్త వహించాలి

సిద్దిపేట అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులతో ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సురభి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దినేష్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామ్ రావు అన్నారు. సురభి వైద్య సంస్థల చైర్మన్ హరీందర్‌రావు ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలోని సూపర్ మల్టీ స్పెషల్టీ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక కౌన్సిలర్ ఎండి రియాజుద్దీన్ చొరవతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 454 మందికి పరీక్షలు నిర్వహించి, 150 మందికి ఉచితంగా రక్త పరీక్షలు చేసి మందులను అందించినట్లు వైద్య బృందం తెలిపారు.


వైద్య శిబిరంలో పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్లు

స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై అవగాహన

కొండపాక, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం స్టూడెంట్ కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో స్ట్రెస్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రం నగేష్ బృందం అవగాహన కల్పించారు. విద్యార్థులు వత్తిడిని ఎలా ఎదుర్కోవాలో, జీవితంలో ఉన్నత శిఖరాలను మనసును నియంత్రించి ఎలా చేరుకోవాలో తెలిపారు.

అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య


హరీష్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో గురువారం జరిగింది. సిద్దిపేట్ జిల్లా రాంపురం గ్రామానికి చెందిన దుబ్బాక హరీష్(26) 20రోజుల క్రితం ఉపాధి నిమిత్తం కుత్బుల్లాపూర్‌లోని సుచిత్ర పరిధిలోని జయశ్రీ బాయిస్ వసతిగృహంలో ఉంటూ ర్యాపిడో నడిపించుకొంటూ జీవిస్తున్నాడు. ఊరులో ఉన్నపుడు వ్యవసాయం చేసేవాడు. దీంతో అప్పులు ఎక్కువకాగ అప్పుల బాధను భరించలేక మనస్తాపానికి గురై బుదవారం సాయంత్రం తానుంటున్న వసతిగృహంలో ఉరివేసుకొని మృతిచెందాడు. దీనిని గమనించిన వసతిగృహం నిర్వాహకులు మృతుడి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకొన్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పరిహారం ఇవ్వరూ..పనులు చేయరు!

(5వ పేజీ తరువాయి)

దీంతో రైతులు గత ఐదేళ్లుగా తమ భూములను అమ్ముకోలేక, ప్రభుత్వం నుంచి మెరుగైన పరిహారం అందక తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.

నేటికీ ముందుకు సాగని పనులు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ వేసి ఐదేళ్లు గడిచినా ఇప్పటివరకు కాలువ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగడం లేదు. మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాలకు ఇచ్చినట్లుగా ఎకరాకు రూ. 13 లక్షల పరిహారం చెల్లించాలని డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్వాసిత రైతులు కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళనకు అప్పట్లో దుబ్బాక ఎమ్మెల్యేగా పనిచేసిన ప్రస్తుత మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు.

నిర్వాసిత రైతులకు రూ. 13 లక్షల పరిహారం ఇప్పించేందుకు న్యాయపోరాటం చేస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు కావస్తున్నా వారి గురించి పట్టించుకునే నాథుడు కరువయ్యారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు తమకు న్యాయం జరిగేలా చూడాలని నిర్వాసిత రైతులు వేడుకుంటున్నారు.

మెరుగైన పరిహారం చెల్లించాలి



డిస్ట్రిబ్యూటరీ కెనాల్‌లో కాన్గల్ శివారులో నాకున్న 13.5 గుంటల భూమి పోతుంటే అధికారులు కేవలం రూ. 64 వేలు మాత్రమే వస్తాయని చెబుతున్నారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో భూములు పోయిన రైతుల మాదిరిగా ఎకరాకు రూ. 13 లక్షలు చెల్లించి మాకు న్యాయం చేయాలి.

- మాధవరెడ్డిగారి భాస్కర్‌రెడ్డి, నిర్వాసిత రైతు(తొగుట)

మాకు న్యాయం చేయాలి



డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కాలువ కోసం ప్రభుత్వం ఐదేళ్ల క్రితం జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేసి మా భూములను నిషేదిత జాబితా నుంచి తొలగించి మాకు న్యాయం చేయాలి. కాలువ కోసం 25.5 గుంటల భూమిని కోల్పోవాల్సి వస్తుంది. తక్కువ ధరకు భూమిని ఎలా ఇస్తాం.

- ఎం. రమణారెడ్డి, రైతు (కాన్గల్)

ద్విచక్రవాహనం అదుపు తప్పి..

● ఇద్దరికి తీవ్ర గాయాలు

మిరుదొడ్డి, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం కేంద్రంలో ఎన్‌హెచ్‌డీజీ765 జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్ ,బాబులాల్ పనుల నిమిత్తం సిద్దిపేటకు వచ్చి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పి కిందపడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్ వాహనంలో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీంతో కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

నాచగిరి క్షేత్రంలో ఘనంగా కార్తీక దీపారాధన

● భక్తిపారవశ్యమైన క్షేత్రం

వర్గల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా నిర్వహిస్తున్న కార్తీక దీపారాధన కార్యక్రమం గురువారం 22వ రోజుకు చేరుకుంది. దేవాదాయ దర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి నిత్యకార్తీక దీపోత్సవంలో భాగంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసీన కార్తీక దీపాలను భక్తులు దీపారాధన చేశారు. ఆలయ దర్మకర్తలమండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్‌గుప్త, ఆలయ కార్యనిర్వహణాధికారి విజయరామారావు పర్యవేక్షనలు నిత్యకార్తీక దీపారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.


కార్తీక మాసం సందర్భంగా దీపారాధన చేసిన భక్తులు

బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తే చర్యలు

జగదేవ్‌పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే వారిపై చర్యలు తప్పవని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని తిగుల్‌లో బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించారు. మద్యం అమ్ముతున్న నలుగురిపై కేసు నమోదు చేసి 25లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జగ దేవ్‌పూర్ ఎస్సై కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ముందస్తు బాలల దినోత్సవం


వేషధారణల్లో విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) :సిద్దిపేట భారత్ నగర్‌లోని శ్రీవాణి స్కూల్‌లో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు నెహ్రూ, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి వేషధారణలో ఆకట్టుకున్నారు. సుమారు 240 మంది విద్యార్థిని, విద్యార్థుల చేత నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సి .హెచ్. సత్యం, పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.